## 76. హెచ్చరిక

పూర్వం గురు శిష్యులు ఇద్దరు కాశీకి వెళుతున్నారు. వారు ఓ అడవి మార్గంలో ప్రయాణిస్తూండగా అకస్మాత్తుగా గురువు ఆగి అప్పుడే మొలకెత్తుతున్న ఓ మొక్కని చూపించి చెప్పాడు.

"దాన్ని పీకేయ్."

శిష్యుడు దాన్ని రెండు వేళ్ళ మధ్యా పట్టుకుని సుతారంగా పీకేసాడు.

మరి కొంత దూరం వెళ్ళాక గురువు దాని కంటే పెద్దగా వున్న మొక్కని చూపించి చెప్పాడు.

"దీన్ని కూడా పీకేయ్."

శిష్యుడు దాన్ని ఒక్క చేత్తో పట్టుకుని పీకేసాడు. ఇంకొంచెం దూరం వెళ్ళాక చిన్న చెట్టుని చూపించి దాన్నీ పీకేయమని గురువు చెప్తే, శిష్యుడు రెండు చేతులతో దాన్ని పట్టుకుని అతి ప్రయాసతో పెకలించగలిగాడు. మరి కొంత దూరం వెళ్ళాక ఊడలు వేలాడే మర్రి చెట్టుని చూపించి గురువు దాన్ని పీకేయమని శిష్యుడితో చెప్పాడు. ఎంత ప్రయత్నించినా దాన్ని పీకడం శిష్యుడి వల్ల కాలేదు.

"వత్సా! మనలోని చెడు సంస్కారాలు ఈ మొక్కల్లాంటివే. మనకి కలిగే చెడు వ్యామోహాలని గుర్తించగానే మొదట్లోనే వాటిని పెరికి వెయ్యకపోతే, అవి పెరిగి ఊడలూనాక ఇక పెకలించడం మన వల్ల కాదు. కాబట్టి వ్యసనాలని చేరదీస్తే తర్వాత వాటిని వదిలించుకోవడం కష్టం." హెచ్చరించాడు గురువు.

## 77. జిజ్ఞాసువు లక్షణం

ఓ యువకుడు బ్రహ్మవిద్యని అభ్యసించడానికి ఓ ఆశ్రమానికి వెళ్ళి ఓ గురువుని కలిసాడు. తను వచ్చిన పని చెప్పాడు.

"చాలా దూరం ప్రయాణించి వచ్చావు. ముందు భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకో." చెప్పాడు గురువు.

అన్నం వడ్డించే శాలకి తీసుకెళ్ళారు శిష్యులు. అతనికి అన్నం వడ్డించాక చెప్పారు వాళ్ళు.

"ఇక్కడ రెండు రకాల కూరలున్నాయి. కారం, ఉప్పు, పులుపు లేకుండా చేసింది ఒకటి. ఇంకో దాంట్లో అన్నీ సమపాళ్ళలో వేసి రుచిగా చేసిన కూర. నీకేది కావాలనుకుంటే అది వేసుకో."

ఆ యువకుడు భోజనం చేసి కాసేపు విశ్రమించాక గురువుని మళ్ళీ కలిసాడు.

"నాయినా! జిజ్ఞాసువు లక్షణం ఇంద్రియాలకి వశుడై ఉండక పోవడం. రుచికి లోబడినవాడు వేదాంతానికి పనికిరాడు. తగిన సాధనతో దానిమీద కొంతైనా ఆధిపత్యాన్ని సంపాదించకున్నాక వచ్చి కలు." చెప్పి గురువు ఆ యువకుడ్ని వెనక్కి పంపించేసాడు.

## 78. ఎవరు?

ఓ రోజు బుద్ధుడ్ని ఒకరు అడిగారు.

"స్వామి! మీరు ప్రవక్తా?"

"కాదు." జవాబు చెప్పాడు బుద్ధుడు.

"పోనీ మీరు బాధలని తొలగించేవారా?"

"ఊహు."

"ఐతే మీరు బోధకుడై వుండాలి."

"నేను బోధకుడ్ని కూడా కాను." చెప్పాడు బుద్ధుడు.

"మరి మీరు ఎవరు?" ప్రశ్నించాడు అతను.

"నేను నిద్ర లేచిన వాడిని." జవాబు చెప్పాడు బుద్ధుడు.